ప్రజాశక్తి

గురువారం 28 మార్చి 2024 5 విజయనగరం



టెన్త్ పరీక్షకు 630 మంది గైర్హాజరు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పదో తరగతి పరీక్షల్లో భాగంగా బుధవారం జరిగిన సోషల్ స్టడీస్ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 630 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా 24727 మంది హాజరు కావాల్సి ఉండగా వారిలో 24097 మంది హాజరయ్యారు. 630 మంది గైర్హాజరయ్యారు. జిల్లాలో 129 కేంద్రాల్లోనూ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని,జిల్లా విద్యా శాఖ అధికారి ఎన్.ప్రేమ్ కుమార్ తెలిపారు. గురువారం సంస్కృతం పరీక్షతో టెన్త్ పరీక్షలు ముగియనున్నాయని తెలిపారు.

విజయనగరంలో పోటాపోటీ

- నగర అభివృద్ధిపై కోలగట్ల ధీమా
- ప్రభుత్వంపై వ్యతిరేకతే గెలిపిస్తుందంటున్న అదితి





ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

విజయనగరం రాజకీయాలు ఆసక్తికరంగానూ, రసవత్తరంగాను సాగుతున్నారు. ప్రధాన పార్టీల అభ్యర్థుల మధ్య రాజకీయం హోరాహోరీగా సాగుతోంది. దీంతో, ఈ అసెంబ్లీ స్థానంలో ప్రస్తుతం వైసిపి, టిడిపి మధ్య పోటాపోటీ పరిస్థితులు నెలకొన్నాయి. విజయనగరం నగర పాలక సంస్థలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు తనను గెలిపిస్తాయని వైసిపి అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి ధీమా వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వంపై వ్యతిరేకత పెరిగిందని, ఈ ఎన్నికల్లో జనసేన అదనంగా తోడైందని, వీటితోపాటు ఎమ్మెల్యే కోలగట్ల ఏకపక్ష వైఖరి కూడా తనకు కలిసి వస్తుందని టిడిపి అభ్యర్థి పూసపాటి అదితి గజపతిరాజు చెబుతున్నారు. కొద్దిరోజులుగా ఇరు పార్టీల అభ్యర్థులూ ప్రచారంలో దూకుడు పెంచారు. కోలగట్ల సుమారు ఆరు నెలలుగా చాపకింద నీరులా అన్ని సామాజికవర్గాలు, ప్రాంతాలు, ఉద్యోగ, వ్యాపార సంఘాలతో మమేకమై ఎన్నికల వ్యూహానికి పదును పెట్టారు. పరిస్థితులను ఎప్పటికప్పుడు తనకు అనుకూలంగా మార్చుకునే పనిలో వున్నారు. కోలగట్ల చెబుతున్నట్టు నగరంలో కొన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన మాట వాస్తవమే. ముఖ్యంగా నగరంలో రోడ్ల విస్తరణ గడిచిన ఐదేళ్ల మునుపెన్నడూ లేనంతగానే చేపట్టారు. పార్కులూ, సెంటర్ లైటింగ్, ముఖ్యమైన కూడళ్లలో ఆకర్షనీయమైన విగ్రహాలు ఏర్పాటు చేశారు. గతంతో పోలిస్తే నగరంలోని ఇదో మైలు రాయి అనే మాట వినిపిస్తోంది. ఇవన్నీ కోలగట్లకు కలిసొచ్చే అంశాలేనని పలువురు విశ్లేస్తున్నారు. కానీ, అభివృద్ధి అంటే రోడ్లు, పార్కులు, లైటింగ్ వంటివేనా? ఉపాధి అవకాశాలు ఏమైనా పెంచారా? కనీసం ఉన్న ఉపాధి అవకాశాలనైనా నిలబెట్టారా? జ్యూట్ మిల్లుల మూతకు కారకులెవరు? ఆయా స్థలాలను వసరపర్చుకున్నదెవరు? అంటూ టిడిపి అభ్యర్థితోపాటు ఆమె మద్దతుదారులు ప్రశ్నిస్తూ ప్రచారం చేస్తున్నారు. నగర అభివృద్ధిలో ప్రత్యేకించి కోలగట్ల చేసింది ఏముంది? అని కూడా వైసిపికి కౌంటర్ ప్రచారం చేస్తున్నారు. సొమ్ముకరిదీ సోకొకరిది అన్నట్టుగా నగరపాలక సంస్థ సొమ్ముతో చేపట్టిన పనులను కోలగట్ల తన గణకార్యంగా చెప్పుకుంటున్నారనే విమర్శలు కూడా తెలుగు తమ్ముళ్ల నుంచి వ్యక్తమౌతున్నాయి. నగరపాలక సంస్థలో మితిమీరిన జోక్యంతో పెత్తనం చలాయించి ఈ పనులన్నీ చేశారని, చివరకు సొంత పార్టీకి చెందిన కార్పొరేటర్లకు సైతం స్వేచ్ఛలేకుండా చేశారని కూడా ప్రచారం చేస్తున్నారు. ఆయన చేసిందంటూ లేక కార్పొరేషన్ తరపున చేసినవన్నీ గొప్పగా చెప్పుకుంటున్నారని విమర్శలు గుప్పిస్తున్నారు. అదితి తండ్రి అశోక్ గజపతిరాజు రాష్ట్ర, కేంద్ర మంత్రులుగా పనిచేసినా నగరానికి ఒరింగిందేమీ లేదని, అసలు ప్రజల సమస్యలే పట్టించుకోలేదని, అందువల్లే చారిత్రక విజయనగరం చాలా వెనుకబడిందని కోలగట్ల, ఆనుయాయులు చెబుతున్నారు. నగరం అభివృద్ధి జరిగిందంటే తాను ఎమ్మెల్యేగా, తన కుటుంబ సభ్యులు కార్పొరేషన్‌లో అడుగుపెట్టాకే జరిగిందని కోలగట్ల వాదన వినిపిస్తోంది. మాన్సాస్ భూములు, ఆస్తులు రాజులే కొల్లగొట్టారని వైసిపి నాయులు చెబుతుండగా, స్వామి ఎమ్మెల్యే అయ్యాయక నగరంలో దందాలు పెరిగిపోయంటూ టిడిపి నేతలు విమర్శిస్తున్నారు. తాము నిర్మించిన టిడ్కో ఇళ్లను కూడా పేదలకు పంపిణీ చేయలేదని టిడిపి, తమ హయాంలో వేలాది మందికి సొంత స్థలాలు, ఇళ్ల మంజూరు సాధ్యమైందని వైసిపి కేడర్ చెబుతోంది. ఇలా ప్రచారంలోనూ ఒకొరికొకరు ధీటుగానే దూసుకెళ్తున్నారు. గతంతో పోలిస్తే టిడిపి అభ్యర్థి తరపు ప్రచారం భిన్నంగా ఉంది. రెండు నెలల ముందు నుంచే ఇంటింటికి వెళ్లడంతోపాటు వార్డు స్థాయి నాయకులు, కార్యకర్తలతో అదితి గజపతి మమేకమౌతున్నారు. క్షేత్ర స్థాయి కేడర్‌తో కమ్యూనికేషన్ పెరుగుతోంది. ఈ నేపథ్యంలో వైసిపి టిడిపి నాయకులు, కార్యకర్తలు ఎవరికి వారేదీమా వ్యక్తం చేస్తున్నారు.

- నారా లోకేష్‌తో చర్చలు విఫలం
- ఇండిపెండెంట్‌గా గొంప కృష్ణ పోటీకి సిద్ధం
- ఎస్.కోట, కొత్తవలసలో భారీ సభలకు సన్నాహాలు



తగ్గేదే లే

ప్రజాశక్తి-శృంగవరపుకోట, వేపాడ

చివరి వరకు టిక్కెట్ ఇస్తామని చెప్పిన పార్టీ అధిష్టానం తనకు వెన్నుపోటు పొడవడాన్ని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంపకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అప్పటివరకు ఎమ్మెల్యే టిక్కెట్టు తనకే కేటా ఇస్తామని, నియోజకవర్గంలోకి వెళ్లి సంబరాల ఏర్పాట్లలో ఉండాలని తనను పంపించేసి వెంటనే కోళ్ల లలిత కుమారికి ఉమ్మడి అభ్యర్థిగా టికెట్‌ను ప్రకటించడంతో పార్టీ నాయకత్వంపై గుర్రుగా ఉన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే గొంప కృష్ణ తనకు మద్దతుగా ఉన్న నియోజకవర్గంలోని ఐదు మండలాల నాయకులు, కార్యకర్తలతో పాటు అధిక సంఖ్యలో నియోజకవర్గ ప్రజలతో గత ఆదివారం పట్టణంలోని విశాఖ అరకు రహదారిలో భారీ సభను ఏర్పాటు చేశారు. ఈ సభలో టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తల కోరిక మేరకు తాను ఇండిపెండెంట్‌గా నైనా పోటీ చేసి తీరుతారని ప్రకటించారు. ఈనేపథ్యంలో పార్టీ నాయకులు చంద్రబాబు నాయుడు గొంప కృష్ణకు ఫోన్ చేసి విజయవాడ వచ్చి తనను కలవాలని ఆదేశించారు. గొంప కృష్ణ చంద్రబాబును కలవటానికి సమ్మతించకపోవడంతో సోమవారం యార్లగడ్డ మురళీకృష్ణ ఎస్.కోట వచ్చి గొంప కృష్ణతోను, ఆ గ్రూపు నాయకులతోను మాట్లాడారు. బి- ఫామ్ ఇచ్చేవరకు టిక్కెట్టు ప్రకటన శాశ్వతం కాదని, రెబల్ అభ్యర్థిగా పోటీ చేస్తాననడం సరికాదని, చివరి వరకు వేచి చూడాలని లేకుంటే సరైన నామినేటెడ్ పదవితో పార్టీలో ఉన్నత స్థానం కల్పిస్తారని తెలిపారు. అయినా గొంపకృష్ణ గ్రూపు నాయకులు ససేమిరా అనడంతో ఆ విషయాన్ని నారా లోకేష్ నారా లోకేష్‌కు మురళీకృష్ణ తెలిపారు. దీంతో లోకేష్ గొంపకృష్ణకు ఫోన్ చేసి తనను కలవాలని చెప్పడంతో కృష్ణతో పాటు గొంప వెంకటరావు, గొరపల్లి రాము, పైడి బాబు, రాయవరపు చంద్రశేఖర్ తదితరులు బుధవారం విజయవాడ వెళ్లారు. కృష్ణకు ఎమ్మెల్సీ పదవి ఇస్తామని, మిగతానాయకులకు కూడా నామినేటెడ్ పదవులు ఇస్తామని, ఈ సారికి కోళ్ల లలిత కుమారిని గెలిపించాలని లోకేష్ కోరారు. గొంపకృష్ణ స్పందిస్తూ గతంలో విశాఖపట్నంలో అచ్చెంనాయుడు, బుద్ధ వెంకన్న సమక్షంలో చర్చలు జరిగినప్పుడు ఎమ్మెల్యే టికెట్ ఇస్తామని చెప్పారని, లలిత కుమారి, రాంప్రసాద్ అంగీకరించక పోయినప్పటికీ ఎమ్మెల్యే టికెట్ తనకే ఇస్తామని, నియోజకవర్గంలో కార్యక్రమాలు చేసుకోవాలని చెప్పారని గుర్తు చేశారు. తమకు ఎమ్మెల్సీ వద్దని, ఇండిపెండెంట్‌గా పోటీ చేసి, గెలిచి మళ్లీ వస్తామంటూ అక్కడి నుంచి వచ్చేశారు. ఎస్.కోట, కొత్తవలసలో భారీ సభలు ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎస్.కోటలో టిడిపి రాజకీయాలు ఉత్కంఠగా మారాయి.



క్వారీ నిర్వాహకుడు అనిల్ కారును అడ్డుకుంటున్న గ్రామస్తులు

మూడో రోజూ క్వారీ పనులు నిలిపివేత

క్వారీ నిర్వాహకుడిపై గ్రామస్తుల ఆగ్రహం

ప్రజాశక్తి- భోగాపురం

మండలంలోని రామచంద్ర పేట క్వారీ పనులు రెండు రోజుల నుంచి గ్రామస్తులు నిలిపివేస్తున్న విషయం తెలిసిందే. మూడో రోజు బుధవారం కూడా క్వారీ పనులు గ్రామస్తులంతా కలిపి అడ్డుకున్నారు. నిర్వాహకుడు అనిల్ ఎట్టకేలకు క్వారీ వద్దకు వచ్చారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు దుక్క అప్పన్న, రవణ, సుగ్గు రాము, కోలా రామసూరి తదితరులు క్వారీ వ్యవహారంపై ప్రశ్నించారు. దీనిపై అనిల్ మాట్లాడుతూ తాను మీతో మాట్లాడడానికి రాలేదని, ఏదైనా ఉంటే గ్రామస్తులతో మాట్లాడుతానని సమాధానం ఇచ్చాడు. ఆయన మాటలపై గ్రామస్తులంతా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. క్వారీలో ఇష్టానుసారంగా బాంబు పేలుళ్లు నిర్వహిస్తుంటే గ్రామంలో ఎలా ఉండాలని ప్రశ్నించారు. 200 అడుగుల లోతుల్లో డ్రిల్లింగ్ చేసి బాంబులు పేలుస్తుండడంతో గ్రామంలోని ఇళ్ల పునాదులు కదిలిపోతున్నాయని అన్నారు. తాగునీరు కలుషితమై కిడ్నీలు పాడై చనిపోతున్నారని అన్నారు. దీనికి సమాధానం చెప్పాలని నిలదీశారు. క్వారీ అనుమతులు పొందిన యజమాని రామరాజు ను పిలిపించాలని దుక్క అప్పన్న అన్నారు. నిర్మాణం పూర్తయిన సచివాలయం ప్రారంభోత్సవానికి నోచుకోకుండా కోర్టుకు వెళ్లి నిలిపివేసిన ఆయన రావాలని డిమాండ్ చేశారు. నిర్వాహకుడు అనిల్ ఎటువంటి సమాధానం చెప్పకుండా వెళ్లిపోతుండడంతో గ్రామస్తులు అడ్డుకున్నారు. సమస్యలు పరిష్కారం అయ్యేవరకు పనులు అడ్డుకొని తీరుతామని గ్రామస్తులు హెచ్చరించారు.

పోలింగ్ నిర్వహణలో పిఒ పాత్ర కీలకం

ఒక్క తప్పు కూడా చేయకూడదు : జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరం

ఎన్నికల్లో పిఒల పాత్ర అత్యంత కీలకమని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అన్నారు. ఒక్క తప్పు కూడా చోటు చేసుకోకుండా ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. దీనికోసం ఎన్నికల ప్రక్రియ, విధులు, ఇవిఎంలు, వివి ప్యాట్ల పనితీరుపై సంపూర్ణ అవగాహన ఉండాలని సూచించారు. వివిధ నియోజకవర్గాల నుంచి మాస్టర్ ట్రైనీలుగా ఎంపికైన ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం శిక్షణ నిర్వహించారు. ఎన్నికల ప్రక్రియ, ఈవీఎంల పనితీరు, పిఒలు, ఎపిఒల విధులు, బాధ్యతలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఎన్నికల కమిషన్ రూపొందించిన వీడియోను ప్రదర్శించి అవగాహన కల్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, పోలింగ్ రోజున, సంబంధిత పోలింగ్ బూత్‌లో పిఒదే సర్వాధికారమని చెప్పారు. అందరి విధులపైనా పిఒలకు అవగాహన ఉండాలని సూచించారు. రీ పోలింగ్‌కు ఎక్కడా అవకాశం ఇవ్వకూడదని, ఎట్టి పరిస్థితిలోనూ తప్పులు, పొరపాట్లు జరగకూడదని స్పష్టం చేశారు. వీలైనంత వరకు వేగంగా పోలింగ్ పూర్తి చేయడానికి కృషి చేయాలన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలను ఖచ్చితంగా అమలుచేయాలని ఆదేశించారు. తమ వ్యక్తిగత అభిప్రాయాలను, అభిమానాన్ని ఎక్కడా ప్రదర్శించకూడదని స్పష్టం చేశారు. పోలింగ్‌కు 90 నిమిషాల ముందే మాక్ పోల్ నిర్వహించాలని చెప్పారు. హ్యాండ్ బుక్, చేయాల్సిన, చేయకూడని జాబితా, చెక్ లిస్ట్ లను తమతో పాటు ఉంచుకోవాలన్నారు. ముందురోజు రాత్రే తప్పనిసరిగా పోలింగ్ కేంద్రానికి చేరుకోవాలని, ఉదయం 5.30కే మాక్ పోల్ జరుగుతుంది కాబట్టి, ముందురోజు రాత్రే



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

బూత్‌లో ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలని సూచించారు. మొత్తం మూడుదశల్లో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, అసిస్టెంట్ కలెక్టర్ సహదిత్ వెంకట త్రివినాగ్, డిఆర్ఒ ఎస్‌డి అనిత, ట్రైనింగ్స్ నోడల్ ఆఫీసర్ సుధాకర రావు, ఆర్ఒలు ఎంవి సూర్యకళ, బి.శాంతి, బి.సాయిశ్రీ, నూకరాజు, మురళీకృష్ణ, మున్సిపల్ కమిషనర్ ఎం.మల్లయ్య నాయుడు, ఎన్నికల సూపరింటెండెంట్ ప్రభాకర్ పాల్గొన్నారు.

ఏప్రిల్ 14 లోగా ఓటు కోసం దరఖాస్తు

ఏప్రిల్ 14వ తేదీ లోగా కొత్తగా ఓటు నమోదు కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి సూచించారు. ఇలా వచ్చిన దరఖాస్తులను 25వ తేదీలోగా పరిశీలించి, అర్హులైనవారికి ఓటుహక్కు కల్పిస్తామని తెలిపారు. ఏప్రిల్ 14 తరువాత కూడా ఓటుకోసం దరఖాస్తు చేసుకొనే అవకాశం ఉన్నప్పటికీ, వాటిని పరిశీలించి ఓటుహక్కు కల్పించేందుకు పరిపడా సమయం ఉండదని ఆమె స్పష్టం చేశారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో తన ఛాంబర్‌లో బుధవారం కలెక్టర్ సమావేశమయ్యారు. ఓటర్ల జాబితాలో చేర్పులు, మార్పులు, ఎన్నికలకు సంబంధించిన ఇతర అంశాలపై చర్చించారు. ఈ వారంలో వచ్చిన దరఖాస్తుల వివరాలను కలెక్టర్ వెల్లడించారు. ప్రస్తుతం రాజకీయ పార్టీలు చేసే ఖర్చు అంతా పార్టీ ఖాతాలోకి వెళ్తుందని, నామినేషన్లు వేసిన తరువాత అభ్యర్థుల ఖాతాలో లెక్కిస్తారని చెప్పారు. ర్యాలీలు, ప్రదర్శనలు, ఇంటింటి ప్రచారం, పాంప్లేట్ల పంపిణీకి కూడా అభ్యర్థులు సంబంధి ఆర్ఒల నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. రెండుమూడు రోజులకు ముందే ధరఖాస్తు చేయాలని, వీలైనంత త్వరగా అనుమతులు జారీ చేస్తామని చెప్పారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, డిఆర్ఓ ఎస్‌డి అనిత, ఆర్ఒలు మురళీకృష్ణ, నూకరాజు, ఎన్నికల విభాగం సూపరింటిండెంట్ ప్రభాకర్, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

నగరంలో పోలీసు కవాతు

ప్రజాశక్తి-విజయనగరంకోట

ఎన్నికల నేపథ్యంలో నగరంలోని దాసన్నపేట, లంకవీధి, కాటవీధి, రాజీవ్ నగర్ ప్రాంతాల్లో టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ కె.రామారావు. ఎస్ఐ దుర్గా ప్రసాద్ ఆధ్వర్యంలో సివిల్, కేంద్ర బలగాలు సంయుక్తంగా ఫ్లాగ్ మార్చ్ నిర్వహించాయి. మే 13న రాష్ట్రంలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు చేపట్టిన ముందస్తు చర్యల్లో భాగంగా ఈ ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. శాంతియుతంగా ఎన్నికల నిర్వహణకు ప్రజలందరూ సహకరించాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తుల సమాచారం అందించాలని కోరారు.

యువత సమాజ హితం కోసం పనిచేయాలి

సిటియు విసి కట్టిమణి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్



విద్యార్థికి సర్టిఫికెట్ అందజేస్తున్న సిటియు విసి కట్టిమణి

యువత చదువు పైనే కాకుండా సామాజిక స్పృహను పెంపొందించుకోవాలని, తద్వారా సమాజ హితమైన కార్యక్రమాలు చేపట్టాలని సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ విసి ప్రొఫెసర్ తేజస్వి కట్టిమని తెలిపారు. ప్రపంచ సోషల్ వర్క్‌డే సందర్భంగా బుధవారం కేంద్రీయ గిరిజన విశ్వ విద్యాలయంలో 'సోషల్ వర్క్ - ట్రాన్స్‌ఫార్మేషన్ అఫ్ ట్రైబల్ డెవలప్మెంట్' అనే అంశంపై జరిగిన సెమినార్‌కు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ గిరిజనుల జీవితం చాలా స్వచ్ఛమైనదని, వారి అలవాట్లు, ఆచార వ్యవహారాలను అర్థం చేసుకొని వారు ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టిపెట్టి అభివృద్ధి వైపు వారిని నడిపించాల్సిన భాద్యత సోషల్ వర్క్ విద్యార్థులకు ఉందని తెలిపారు. ముఖ్య అతిధిగా విచ్చేసిన ముంబైకి చెందిన టాటా ఇనిస్టిట్యూట్ అఫ్ సోషల్ సైన్సెస్ డీన్ ప్రొఫెసర్ బిపిన్ జోజో మాట్లాడుతూ సామాజిక శాస్త్రాల అధ్యయనంవల్ల యువతలో సమాజంపై స్పందించే తత్త్వం పెరుగుతుందని అన్నారు. ఈ సందర్భంగా గిరిజన విశ్వ విద్యాలయం లో గిరిజనుల అబివృద్ధి కోసం జరుగుతున్న కార్యక్రమాలను ఆయన కొనియాడారు. కార్యక్రమంలో స్కూల్ అఫ్ సోషల్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ శరత్ చంద్ర బాబు తదితరులు పాల్గొన్నారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

నాసిరకం రోడ్డు పనులపై ఫిర్యాదు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అంబటిసత్రం రోడ్డు పనులు నాసిరకంగా జరుగుతున్నాయని, వెంటనే ఆ పనులను పరిశీలించాలని వైసిపి పార్లమెంటరీ పార్టీ కార్యదర్శి ముద్దాడ మధు నగర పాలక సంస్థ కమిషనర్ ఎంఎం నాయుడుకు బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మధు యాదవ్ మాట్లాడుతూ కోట్లాది రూపాయలు ప్రజాధనంతో జరుగుతున్న రోడ్డు పనులు అధికారుల పర్యవేక్షణ సరిగ్గా లేకపోవడం వలన నాణ్యత పూర్తిగా కొరవడిందని, ఇప్పటివరకు కనీసం వాటర్ క్యూరింగ్ కూడా చేయలేదని తెలిపారు. ఎన్నికల కోడ్ ఉన్నందువలన అధికారులందరూ వీటిపై దృష్టి పెట్టకపోవడంతో పనులు నిర్లక్ష్యంగా, నాణ్యత లేకుండా జరుగుతున్నాయని తెలిపారు.

పేరుకుపోతున్న నీటి పన్ను బకాయిలు

20 శాతం దాటని పన్నుల వసూలు ● రూ.5.76కోట్లకు రూ.1.05 కోట్లే వసూలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్



నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో నీటి పన్ను వసూలు నామ మాత్రంగానే జరుగుతోంది. ప్రతి ఏటా నీటి పన్ను ద్వారా నగర పాలక సంస్థకు రూ.1.76 కోట్లు పనున్నుల రూపంలో వసూలు కావాల్సి ఉంది. గత కొంత కాలంగా కట్టాల్సిన పన్ను బకాయిలు రూ.4.4 కోట్లు వరకు ఉంది. ఈ ఏడాది పన్నుతో కలుపుకొని మొత్తం నగర పాలక సంస్థ కు రావాల్సిన నీటి పన్ను బకాయిలు 5.76 కోట్లు వసూలు కావాల్సి ఉంది.

ఏటా నీటి పన్నుల వసూలులో పురోగతి కనిపించడం లేదు. ఏటా వసూలు కావాల్సిన పన్నులో కేవలం 50 శాతం వరకు మాత్రమే వసూలు చేస్తున్నట్లు తెలుస్తుంది. మిగిలిన బకాయిలు పేరుకుపోయి ఈ ఏడాది మార్చి నాటికి పాత బకాయి రూ.4.70 కోట్లకు పెరిగింది. పోనీ ఈ ఏడాది అయినా వసూలులో పురోగతి ఉందా అంటే అదీ లేదు. పాత బకాయి రూ.4కోట్లకు గాను కేవలం రూ.29 లక్షలు వసూలు అయ్యింది. ఈ ఏడాది నీటి పన్ను వసూళ్లలో 176 లక్షలకు గాను ఇప్పటి వరకు 76 లక్షలు మాత్రమే వసూలు చేశారు. అంటే పాత బకాయి రూ.4 కోట్లు, ఈ ఏడాది వసూలు ఇంకా వసూలు కావాల్సిన మరో కోటి రూపాయలు, వచ్చే ఏడాదికి పాత బకాయి కింద మరో రూ.4.70 కోట్లకు పన్నుల బకాయి పెరగనుంది. ఈ ఏడాది బకాయితో కలిపి రూ.5.76 కోట్లు వసూలు కావాల్సి ఉండగా దానిలో కేవలం రూ.కోటీ 5లక్షలు మాత్రమే వసూలు చేశారు.

మొత్తం కలెక్షన్‌లో 20 శాతం కూడా నీటి పన్ను వసూలుకు నోచుకోలేదు. గతంలో పన్నుల వసూలుకు కేవలం పదుల సంఖ్యలో ఉండే రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌లు, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు మాత్రమే వసూలు చేసేవారు. పని భారం ఎక్కువగా ఉండటం కారణంగా పూర్తి స్థాయిలో వసూలు వసూలు చెయ్యలేకపో యేవారు. కానీ వార్డు స్థాయిలో సచివాలయాలు ఏర్పాటైన తరువాత నగరంలో 59 సచివాలయాలు ఉన్నాయి. సచివాలయంలో రెవెన్యూ విభాగం కార్యదర్శులు కూడా అన్ని సచివాలయాల్లో ఉన్నారు. వారికి కూడా పన్నులు వసూలు చేయాల్సిన బాధ్యత ఉంది. సరిపడా సిబ్బంది ఉన్నా పన్నులు వసూలు కాకపోవడం అధికారులను ఆశ్చర్య పరుస్తోంది. కార్యదర్శులు పన్నులు వసూలుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టకపోవడం, ఇళ్లలో ఎవరూలేని సమయంలో పన్నులు వసూళ్లకు వెళ్లడం వంటి కారణాల వల్ల నత్తనడకన సాగుతున్నట్లు తెలుస్తోంది. నగరపాలక సంస్థ అధికారులు పదే పదే పన్నుల వసూలుపై హెచ్చరించినా పురోగతి లేదంటే సిబ్బందికి ఉన్న శ్రద్ధ ఏ విధంగా ఉందో అర్థమవుతుంది. అధికారులు దృష్టి సారించకపోతే నగర పాలక సంస్థకు మరింత నష్టం జరిగి ఆదాయానికి గండి పడే అవకాశం ఉంది.

ఎచ్చెర్ల బిజెపి అభ్యర్థిగా ఈశ్వరరావు

భగ్గుమన్న కళా గ్రూపు



ప్రజాశక్తి-శ్రీకాకుళం ప్రతినిధి/ విజయనగరం కోట

బిజెపి విజయనగరం పార్లమెంటరీ జిల్లా అధ్యక్షులు నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఇఆర్)కు ఎచ్చెర్ల అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థిగా ఆ పార్టీ టిక్కెట్ కేటాయించింది. దీంతో ఇప్పటి వరకు ఈ సీటుపై ఆశపెట్టుకున్న కళావెంకటరావు గ్రూపు నాయకులు తీవ్ర నిరాశకు లోనయ్యారు. ఎన్ఇఆర్‌కు సామాజిక తరగతి బలం లేదని, గతంలో భూ ఆక్రమణ కేసులు ఉన్నాయని టిడిపి నాయకులు పార్టీ అధిష్టానానికి చేసిన ఫిర్యాదులు ఫలించలేదు. అయినా బిజెపి అధిష్టానం ఎన్ఇఆర్‌కే సీటును కేటాయించింది. కూటమి పార్టీల మధ్య సీట్ల పంపకం టిడిపికి తలనొప్పిగా మారింది. శ్రీకాకుళం నియోజకవర్గంలో బిజెపి నాయకులు కుమ్ములాటలు, ఫిర్యాదుల ఫలితంగా శ్రీకాకుళం స్థానాన్ని వదులుకొని ఎచ్చెర్ల సీటును కోరుకుంది. ఆ నియోజకవర్గంలో ముఖ్య నాయకులుగా ఉన్న ఈశ్వరరావు బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పురందేశ్వరితో చేసిన లాబీయింగ్ ఫలితంగా ఆ సీటును దక్కించుకున్నట్లు తెలిసింది. ఎచ్చెర్ల సీటు ఎన్ఇఆర్ ఖరారు కావడంతో మాజీ మంత్రి కళావెంకటరావు గ్రూపు వారంతా భగ్గుమంటున్నారు. ఇప్పటి వరకు తమ నేతకే సీటు వస్తుందని ఆశలు పెట్టుకున్న నాయకులు, కార్యకర్తలు తీవ్ర నిరాశకు లోనయ్యారు. భవిష్యత్ కార్యాచరణ త్వరలో ప్రకటిస్తామని చెప్పారు. ఎన్ఇఆర్‌ను తప్పించడానికి చంద్రబాబుకు ఫిర్యాదు చేశారు. కాపులు ప్రాబల్యం ఉన్న ఎచ్చెర్ల నియోజకర వర్గంలో కమ్మ తరగతికి చెందిన ఎన్ఇఆర్‌కు బలం అంతగా లేదని, గెలుపు కష్టమని టిడిపి నాయకులు ఫిర్యాదు చేశారు. టిడిపి హయాంలో భూ ఆక్రమణలను సైతం అధిష్టానం దృష్టికి తీసుకెళ్లారు.

ఎన్ఇఆర్‌కి కష్టమే?

గత ఎన్నికల్లో ఎచ్చెర్ల నియోజకవర్గంలో బిజెపికి డిపాజిట్లు కూడా దక్కలేదు. నియోజకవర్గంలో బిజెపి కేడర్ చాలా బలహీనంగా ఉంది. దీంతో పాటు సామాజిక తరగతి బలం కూడా లేకపోవడంతో ఎన్ఇఆర్ గెలిచే పరిస్థితి లేదని టిడిపి నాయకులే చెబుతున్నారు. కళావెంకటరావుకు టిక్కెట్ దక్కకపోవడంతో టిడిపి కేడర్ ఎంతవరకు సహకరిస్తుందోనని సందేహంగా ఉంది. మొత్తంమీద ఆ సీటులో ఎన్ఇఆర్ గట్టెక్కడం చాలా కష్టమే.



సహాయకులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు

వికలాంగుల సహాయకులకు సత్కారం

ప్రజాశక్తి- బాడంగి

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులచే నిర్వహిస్తున్న సహిత క్లబ్ ద్వారా వికలాంగ విద్యార్థులకు సహాయకులుగా ఉన్న విద్యార్థులను బుధవారం సత్కరించారు. ప్రధానంగా మధ్యాహ్న భోజనం, ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొనేటట్లు ప్రోత్సహించడం, ఇంటి నుండి పాఠశాలకు, పాఠశాల నుండి ఇంటికి తీసుకురావటంలో, చదువులో సందేహాలను నివృత్తిలో, ఎఫ్ఎ, ఎస్ఎ పరీక్షలు రాయటంలో సహాయకులుగా పనిచేసిన సాధారణ విద్యార్థులు హరిప్రియ, గీతిక, కుసుమ ప్రియ, దామని, తులసి, సురేష్, ప్రేమ్ కుమార్, హేమంత్, జస్వంత్, కీర్తన, సందీప్‌లను పాఠశాల ఉపాధ్యాయులు, వికలాంగ విద్యార్థుల తల్లిదండ్రులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఇంచార్జ్ హెచ్ఎం టి.లక్ష్మి, ప్రత్యేక ఉపాధ్యాయుడు కొల్లి ఈశ్వరరావు మాట్లాడుతూ ప్రతీ ఒక్క విద్యార్థి వీరిలానే సేవాగుణం అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, త్రినాథ, కేతిరెడ్డి ఈశ్వరరావు, వై.సత్యన్నారాయణ, నారెమ్మ తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న యువత

ఘనంగా రామ్‌చరణ్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సినీహీరో రామ్‌చరణ్ జన్మదిన వేడుకలను బుధవారం విజయనగరంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా సర్వమత ప్రార్ధనలు నిర్వహించారు. అనంతరం పట్టణ నిరాశ్రయుల వసతి గృహంలో అల్పాహారాన్ని అందజేశారు. జిఎస్ఆర్ హోటల్‌లో కేక్‌కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. జిల్లా చిరంజీవి యువత , అంజనీ పుత్ర చిరంజీవి ప్రజా సేవా సంఘం బ్లడ్ డోనర్స్ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాల్లో ముఖ్య అతిథిగా జనసేన నాయకులు గురాన అయ్యలు పాల్గొన్నారు. కార్యక్రమాల్లో టిడిపి నాయకులు పిల్లా విజయ్ కుమార్, జనసేన నాయకులు ఆదాడ మోహన్ రావు, డి. రామచంద్రరాజు, టి.రామకృష్ణ, ఎంటి రాజేష్ , పితాల లక్ష్మీ , దుప్పాడ జ్యోతి పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన

బొబ్బిలి: గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ జన్మదినం సందర్భంగా మెగా అభిమానులు, జనసైనికులు నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. స్థానిక విజేత స్కూల్లో మెగా అభిమాన సంఘం అధ్యక్షులు లంక రమేష్, జనసేన నాయకులు పెద్దింటి మనోజ్ కుమార్ రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. రక్తదాన శిబిరానికి 72మంది యువకులు హాజరై రక్తదానం చేశారు. రక్తదాతలను రమేష్, మనోజ్ అభినందించారు.

క్రీడాకారులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మార్చి 29, 30 తేదీలలో జైపూర్ (రాజస్థాన్)లో విభిన్న ప్రతిభావంతులకు 12వ పార వాలీబాల్ జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు విజయనగరం జిల్లా నుండి విభిన్న ప్రతిభావంతులైన యనమల రామయమ్మ, మీసాల ఆదిలక్ష్మి, చుక్క కన్నతల్లి, పట్నాల రాధ, మురళి, శ్రీను వెళ్తున్నారు. వీరికి రవాణా ఖర్చులకు జెడ్‌పిచైర్మన్ మజ్జిశ్రీనివాసరావు కుమార్తె సిరి సహస్ర రూ.15వేలు ఆర్థిక సాయం అందజేశారు.



ఎంపిడిఒ రవికుమార్‌కు వినతిపత్రాన్నిస్తున్న గిరిజనులు

తాగునీరు అందించాలని వినతి

ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్

మండలంలోని కాసిందొరవలస పంచాయతీ పరిధిలో మోసురు వలస గిరిజనులు ఉప సర్పంచ్ జె.ఆదయ్య ఆధ్వర్యంలో బుధవారం తమకు తాగునీరు అందివ్వాలని ఎంపిడిఒ రవి కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆదయ్య మాట్లాడుతూ తమకు అందాల్సిన నీటిని పాచిపెంట మండలం నుండి తమ గ్రామానికి వలస వచ్చిన గిరిజనులకు సరఫరా చేయడం వల్ల తమకు నీటి కొరత ఏర్పడుతుందన్నారు. తమకు కాకుండా వలస వచ్చిన వారికి నీరివ్వడం వల్ల తాము ఇబ్బంది పడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆ గ్రామ గిరిజనులు పాల్గొన్నారు.

నేడు పార్టీ కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి- శృంగవరపుకోట

ఎస్‌కోటలో టిడిపి, జనసేన, బిజెపి నియోజకవర్గ ఉమ్మడి పార్టీ కార్యాలయాన్ని విశాఖ పార్లమెంట్ ఉమ్మడి పార్టీ ఎంపి అభ్యర్థి మతుకుమల్లి శ్రీభరత్ చేతులు మీదుగా గురువారం ప్రారంభిస్తామని ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కోళ్ల లలిత కుమారి తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో ఉన్న ఐదు మండలాల టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు, మహిళలు ప్రతి ఒక్కరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఘోషాసుపత్రిని కొనసాగించాలి

ప్రజాశక్తి- బొబ్బిలి

పేదలకు వైద్య సేవలందిస్తున్న ఘోషాసుపత్రిని కొనసాగించాలని లోక్‌సత్తా జిల్లా అధ్యక్షులు ఆకుల దామోదర్ డిమాండ్ చేశారు. ఘోషాసుపత్రిని బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు దశాబ్దాలుగా ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న ఘోషాసుపత్రిని మూసివేయడం బాధాకరమన్నారు. భవనం పాడైపోవడం వల్ల రోగులు సక్రమంగా రావడం లేదని, భవనం బాగు చేసి ఆసుపత్రిని కొనసాగించేలా చూడాలని డిమాండ్ చేశారు.

సమస్యలను పరిష్కరిస్తూ అభివృద్ధి

ప్రజాశక్తి - గుర్ల

ప్రజా సమస్యలను పరిష్కరిస్తూ, సంక్షేమ అభివృద్ధి పనులు చేపడుతున్నామని, రైతులకు విత్తనాలు, ఎరువులు ఆర్‌బికె ద్వారా ప్రభుత్వం అందిస్తుందని మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన బుధవారం పకీరు కిట్టలి, పెనుబర్తి గ్రామాలలో పర్యటించారు. గడిచిన 5సంవత్సరాలలో పకీరు కిట్టలి గ్రామానికి నేరుగా రూ.12 కోట్లను ప్రభుత్వం అందించిందన్నారు. పాఠశాలలు అభివృద్ధి, అమ్మఒడి పథకం అమలు చేయడం, ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అందిస్తున్నామని చెప్పారు. రూ.25 లక్షలు వరకు ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యం అందిస్తున్నామన్నారు. రాష్ట్రంలో దళారి వ్యవస్థ లేకుండా చేశామని గతంలో జన్మభూమి కమిటీలు పనితీరు మనం చూశామని వారు గ్రామాలలో దళారీ వ్యవస్థ నడిపించారని గుర్తు చేశారు. చిన్న చిన్న సమస్యలు ఉండవచ్చునని వాటిని అధిగమించాలని

ఎన్నికల ప్రచారంలో మంత్రి బొత్స



గుర్ల: మాట్లాడుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ

సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, జెడ్‌పిటిసి శీర అప్పల నాయుడు, వైసిపి కార్యనిర్వాహక కార్యదర్శి పొట్నూరు సన్యాసి నాయుడు, ధీర ఫౌండేషన్ అధినేత బొత్స సందీప్, పార్టీ అధ్యక్షులు జమ్ము స్వామి నాయుడు, డిఎల్‌డిఎ చైర్మన్ బెల్లాన బంగారు నాయుడు, ఎంపిటిసి బి.జోగినాయుడు, నాయకులు రాగోలు రామకృష్ణ, నాగేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఎమ్మెల్యే బడ్డుకొండ ప్రచారం

పూసపాటిరేగ : మండలంలోని కనిమెల్ల, గుండపురెడ్డిపాలెం, కందివలస గ్రామాల్లో వైసిపి ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు బుధవారం ఎంఎల్‌సి పి. సురేష్‌బాబు, వైసిపి జిల్లా నాయకులు కందుల రఘుబాబుతో కలిసి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని, ఎమ్మెల్యేగా తనను, ఎంపిగా బెల్లాన చంద్రశేఖర్‌ను గెలిపించాలని కోరారు. ప్రచారంలో ఎంపిపి మహంతి కళ్యాణి, వైస్ ఎంపిపిలు రమేష్, సత్యనారాయణరాజు, మండల పార్టీ అధ్యక్షులు పతివాడ అప్పలనాయడు, జెసిఎస్ కన్వీనర్ మహంతి శ్రీనువాసరావు, నాయకులు మహంతి జనార్ధనరావు, కందివలస సర్పంచి దేశెట్టి గణేష్, కనిమెట్ట నాయకులు శాంతాటి శ్రీనువాసరావు, పల్లా సత్యం, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భవనాలపై పార్టీల రంగులు తొలగించాలి

ప్రజాశక్తి-విజయనగరం

ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థలు, భవనాలపై వున్న పార్టీల రంగులను తొలగించాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. సి-విజిల్ యాప్‌లో వచ్చే ఫిర్యాదులపై వంద నిముషాల్లోపే చర్యలు తీసుకొని నివేదికలు సమర్పించాలన్నారు. ప్రైవేటు భవనాలపై ఏదైనా ఒక పార్టీ జెండా, చిన్నపాటి బ్యానర్ లేదా స్టికర్ ఏర్పాటు చేసేందుకు అనుమతి స్తామని, అయితే అందుకు ఆయా భవన యజమాని రాతపూర్వత అనుమతి తప్పనిసరిగా సమర్పించాల్సి వుంటుందన్నారు. ప్రైవేటు, వ్యక్తిగత వాహనాలపై పార్టీ జెండాలు, స్టిక్కర్‌లు ఏర్పాటు చేసుకోవచ్చని అయితే అవి మోటారు వాహనాల చట్టానికి లోబడి వుండాలన్నారు. వాణిజ్య పరమైన, రవాణా వాహనాలపై జెండాలు, స్టిక్కర్‌ల ఏర్పాటుకోసం తప్పనిసరిగా అనుమతి పొందాల్సి వుంటుందని స్పష్టంచేశారు. రాజకీయ పార్టీలు తమ పార్టీ పతాకావిష్కరణ కార్యక్రమాలను ప్రైవేటు స్థలాల్లో భవనాల్లో నిర్వహించుకోవడంలో అభ్యంతరం లేదని, అయితే బహిరంగ ప్రదేశాల్లో నిర్వహించాలంటే తప్పనిసరిగా అనుమతి పొందాల్సి ఉంటుందన్నారు. ప్రైవేటు భవనాలపై కొత్తగా హోర్డింగులు, ఫ్లెక్సీలు ఏర్పాటుకు అనుమతిచ్చేది లేదని స్పష్టం చేశారు.

రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు ముందస్తు ఏర్పాట్లు, ప్రవర్తన నియమావళి అమలు తదితర అంశాలపై రాష్ట్ర ఎన్నికల కమిషన్ సిఇఒ ముఖేష్ కుమార్ మీనా జిల్లా కలెక్టర్‌లతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. పెండింగులో వున్న ఫార్మ్ 7, 8 ల పరిష్కారం, రాజకీయ పార్టీలకు అనుమతుల జారీ, సి-విజిల్ ద్వారా అందే ఫిర్యాదుల పరిష్కారం, ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్ పటిష్టంగా అమలు తదితర అంశాలపై ఆయా జిల్లాల అధికారులతో మాట్లాడారు. అనంతరం కలెక్టర్ రిటర్నింగ్ అధికారులతో జిల్లాలో ఎన్నికల కోడ్ అమలుపై సమీక్షించి పలు సూచనలు చేశారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ బి.సహదిత్ వెంకట్ త్రివినాగ్, డిఆర్ఒ ఎస్‌డి అనిత, ఆర్‌డిఒలు ఎంవి సూర్యకళ, సాయిశ్రీ, బి.శాంతి, పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - లక్కవరపుకోట

స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం సర్వసభ సమావేశం తూతూ మంత్రంగా జరిగింది. సుమారు ఐదుశాఖల అధికారులతో పాటు కొద్దిపాటి ప్రజా ప్రతినిధులు హాజరయ్యారు. అర్థగంట వ్యవధిలో ముగిసిన ఈ సమావేశానికి స్థానిక ఎంపిపి గేదెల శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున సమావేశంలో తగు జాగ్రత్తలు పాటించాలని సభ్యులకు ఎంపిడిఒ కె.రూపేష్ సూచించారు. పంచాయతీ అనుమతులు లేకుండా రేగ రెవెన్యూ పరిధిలో పన్నులు కట్టని మద్యం దుకాణం, దాబాహోటల్, కోళ్లఫారం, మరో నివాస గృహంతో పాటు కల్లేపల్లి వరకు రోడ్డు పక్కల ఉన్న సుమారు 20 దుకాణాలకు విద్యుత్ సరఫరా ఎలా ఇచ్చారని విద్యుత్ శాఖ ఎఇ ఐ. కృష్ణను రేగ ఎంపిటిసి బొడ్డు గణపతి ప్రశ్నించారు. గంగుపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు లోవోల్టేజ్ సమస్య తీవ్రంగా ఉందని తక్షణమే పరిష్కరించాలని గంగుపూడి సర్పంచ్ గొలగాని హరిప్రసాద్ కోరారు. అనంతరం ఎపిఒ ఎం విజయలక్ష్మి మాట్లాడుతూ వేసవికాలం ఎండలు దృష్ట్యా ఉపాధి



ఎల్‌కోట: మాట్లాడుతున్న ఎంపిపి శ్రీనివాసరావు

పని వేళలు ఉదయం 5.30 గంటల నుండి 10.30 గంటల వరకు మార్చామన్నారు. పని ప్రాంతాలలో ఉపాధి కూలీలకు ఎండ తగలకుండా ఉండేందుకు 2018లో ఇచ్చిన టెంట్లుతో పాటు తాటాకులు, కొబ్బరి కొమ్ములతో చలవ పందెరులను వేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో వైస్ ఎంపిపి ఆవాల శ్యామల, చందులూరు, లచ్చింపేట ఎంపిటిసిలు యడ్ల కిషోర్ కుమార్, భూమిరెడ్డి స్వామినాయుడు, కె జగ్గన్నదొర, కో ఆప్షన్ నెంబర్ షేక్ ఖాసిం, సర్పంచులు ముత్యం భాస్కరరావు, కొయ్యన కృష్ణ, కొన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

గైర్హాజరైన అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు

స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి గైరాజరైన అధికారులపై సర్క్యులర్ పంపి ఆ నివేదిక ఆధారంగా జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు స్థానిక మండల కార్యాలయ ఉఒ దొర మీడియాకు వెల్లడించారు. ఎంపిడిఒ అందుబాటులో లేనందున తాను వెల్లడించినట్లు తెలిపారు.

శృంగవరపుకోట: ఎస్‌కోట మేజర్ పంచాయతీ జనరల్ బాడీ సమావేశం బుధవారం నామ మాత్రంగా నిర్వహించామని పంచాయతీ ఇంచార్జ్ ఇఒ సిహెచ్ కన్నబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున పంచాయతీ పాలన వ్యవహారాల గూర్చి చర్చించకూడదని చెప్పారు. ఈ సమావేశంలో పంచాయతీకి వచ్చిన ఆదాయం, జనన మరణాల గూర్చి తెలియపరచి సమావేశాన్ని ముగించామన్నారు. ఈ సమావేశంలో సర్పంచ్ సంతోష్ కుమారి, ఐదుగురు వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన అమ్మవారి జాతరలు

ప్రజాశక్తి- భోగాపురం

మండలంలోని భోగాపురం కనకదుర్గమ్మ, పోలిపల్లి పైడితల్లి అమ్మవారి జాతరలు బుధవారంతో ముగిశాయి. గత మూడు రోజుల నుంచి ఈ పండుగను నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. మంగళవారం సాయంత్రం గతంలో ఎన్నడూ లేనివిధంగా అధిక సంఖ్యలో వివిధ గ్రామాల నుంచి ప్రజలు తరలివచ్చారు. జాతరలో చిన్న చిన్న వివాదాలు యువకుల మధ్య చోటు చేసుకున్నాయి. అయినప్పటికీ సిఐ రవికుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐలు సూర్య కుమారి, తాతారావు సిబ్బందితో కలిసి చాక చక్యంగా అడ్డుకున్నారు. జాతర ప్రశాంతంగా ముగియడంతో నిర్వాహకులు ఊపిరి పీల్చుకున్నారు.

పోలిపల్లి అమ్మవారి ఆదాయం లెక్కింపు

మండలంలోని పోలిపల్లి అమ్మవారి ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. పండుగ మూడు రోజులపాటు మొత్తం రూ.6.97లక్షలు వచ్చినట్లు ఇఒ ఇజ్జురోతు శ్రీనివాసరావు తెలిపారు. హుండీ ఆదాయం రూ.5.78లక్షలు, టికెట్ల విక్రయం ద్వారా రూ.1.19లక్షలు



హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

వచ్చినట్లు ఆయన తెలిపారు. గ్రామ సర్పంచ్ కర్రోతు వెంకటరమణ, ఆలయ కమిటీ చైర్మన్ కర్రోతు పైడిరాజు, దేవాదాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

డెంకాడ: మండలంలోని జొన్నాడ పైడితల్లి అమ్మవారి దేవస్థానంలో బుధవారం విజయనగరం గ్రూపు దేవాలయాల కార్యనిర్వాహణాధికారి కె.పద్మావతి సమక్షంలో హుండీలను లెక్కించారు. ఈ నెల 13న నుండి 27వరకూ రూ. 49,466 ఆదాయం వచ్చింది. ఈ కార్యక్రమంలో ఏక సభ్య ధర్మకర్త జి. శ్రీనివాస్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మిమ్స్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఉద్యోగులను, కార్మికులను, ప్రభుత్వాన్ని మోసం చేస్తున్న మిమ్స్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని మిమ్స్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు టివి. రమణ డిమాండ్ చేశారు. స్థానిక ఆర్‌ఒబి వద్ద తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మిమ్స్ ఉద్యోగులు, కార్మికులు చేస్తున్న నిరశన పోరాటం బుధవారం నాటికి 56వ రోజుకి చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు 7డిఎలు ఇవ్వలేదని, 2019 నుంచి ఇంత వరకు వేతన ఒప్పందం చేయలేదని కాంట్రాక్టు కార్మికులు, ఉద్యోగులను పర్మినెంట్ చేయలేదని తెలిపారు. సమస్యలపై అడిగితే సస్పెన్స్ లు, బదిలీలు, వేధింపులకు పాల్పడి నియంతృత్వ దోరణి అవలంభిస్తోందని తెలిపారు. గత 56 రోజులుగా ఉద్యోగులు, కార్మికులు తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని నిరశన తెలపడంతో మిమ్స్‌లో ఎటువంటి సేవలూ అందడం లేదు సరికదా వైద్య విద్యార్థులకు బోధనలు కూడా అందకుండా పోతున్నాయని ఇంత జరుగుతున్నా (ఎన్ఎంసి) జాతీయ వైద్య మండలి ఏమి చేస్తుందని ప్రశ్నించారు. ఉద్యోగులు, కార్మికులు వల్ల అభివృద్ధి జరిగిన సంస్థను ఏమీ చేయకూడదని ఓపిక, సహనంతో సమస్యల పరిష్కారానికి ఎదురు చూస్తున్నారని ఒక్కసారి కడుపు మంట రగిలితే ఆ మంటలో యాజమాన్యం మాడి మసైపోతుందని హెచ్చరించారు. ఇప్పటికైన మిమ్స్ యాజమాన్యం, ప్రభుత్వం స్పందించి వారి న్యాయమైన సమస్యలు పరిష్కరంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మిమ్స్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి మిరప నారాయణ, ఉద్యోగులు కె.మధు, కె. కామునాయుడు, ఎం. నాగ భూషణం, మూర్తి, గౌరి, బి. బంగారునాయుడు, ఎం.రాం బాబు, వరలక్ష్మి, అప్పల నాయుడు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న రమణ

అగ్రహారం భూ సమస్య పరిష్కారానికి కృషి : కోళ్ల

ప్రజాశక్తి - జామి

భీమసింగి సహకార ఫ్యాక్టరీని నిలబెట్టుకోవడంతో పాటు జామి అగ్రహార భూ సమస్య పరిస్కారమే లక్ష్యంగా పని చేస్తానని మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి హామీ ఇచ్చారు. బుధవారం జామి గ్రామం నుంచి ఎన్నికల శంఖరావం చేశారు. ముందుగా యల్లమాంబా, శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి, జామి దొండపర్తి జంక్షన్ నుంచి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ జెడ్‌పిటిసి



జామి: కార్యకర్తలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే లలితకుమారి

బండారు పెదబాబు అధ్యక్షతన జరిగిన సభలో కోళ్ల మాట్లాడారు. ప్రజా సమస్యలు పరిస్కారానికి, ఫ్యాక్టరీని కాపాడుకోవడానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వర్రీ రమణ, వేంద్రపు నాయుడుబాబు, జనసేన నాయకులు వర్మరాజు, శ్రీలక్ష్మి, బాలరాంపురం, భీమసింగి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వార్డుల్లో బేబినాయన ప్రచారం

బొబ్బిలి: టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడి అభ్యర్థి బేబినాయన పట్టణంలోని ఐదో వార్డులో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అభివృద్ధి చేసేందుకు తనకు ఓటు వేసి గెలిపించాలని బేబినాయన ఇంటింటికి వెళ్లి ఓటర్లను అభ్యర్థించారు. ప్రచారంలో టిడిపి పట్టణ అధ్యక్షులు రాంబర్కి శరత్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గెంబలి శ్రీనివాసరావు, కౌన్సిలర్ వి.హైమవతి, తదితరులు పాల్గొన్నారు.

బేబినాయనకు పట్టణ కళాసీ సంఘం మద్దతు

టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి బేబినాయనకు పట్టణ కళాసీ సంఘం మద్దతు ప్రకటించింది. కోటలో బేబినాయనను పట్టణ కళాసీ సంఘం అధ్యక్షులు



బొబ్బిలి: బేబినాయనకు తిలకం దిద్దుతున్న మహిళలు

బి.అప్పలస్వామి, నాయకులు వై.అప్పారావు, పి.రామకృష్ణ, పి.అప్పారావు, కళాసీ సంఘం సభ్యులు కలిసి మద్దతు ప్రకటించారు. అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉంటున్న బేబినాయనకు అండగా ఉంటామని చెప్పారు. రానున్న ఎన్నికల్లో ఆయన విజయానికి పని చేస్తామన్నారు. తనకు మద్దతు ఇచ్చిన కళాసీ సంఘం నాయకులు, సభ్యులకు బేబినాయన కృతజ్ఞతలు తెలిపారు.

వైసిపిది తప్పుడు ప్రచారం

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

వైసిపి తప్పుడు ప్రచారం మానుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.తిరుపతిరావు హితవుపలికారు. గుమ్మలక్ష్మీపురంలో బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. సిపిఎం నుంచి వైసిపిలో పలువురు కార్యకర్తలు చేరారని సోషల్ మీడియా, పత్రికల్లో వచ్చిన వార్తలను తీవ్రంగా ఖండించారు. ఎక్కడెక్కడో ఉన్న వైసిపి కార్యకర్తలను తీసుకొచ్చి తిరిగి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్నారని ఆరోపించారు. నిజంగా సిపిఎం కార్యకర్తలు, నాయకులు వైసిపిలో చేరితే నిర్దిష్టంగా, బహిరంగంగా సమావేశాలు పెట్టి చూపించి ప్రకటన చేయాలని సవాల్‌చేశారు. అంతేతప్ప ఇటువంటి తప్పుడు ప్రకటనలు చేయడం సరికాదన్నారు. ఒక విధంగా చెప్పాలంటే సిపిఎంని చూసి వైసిపి భయపడుతుందనే సంకేతాలు కనిపిస్తున్నాయని అన్నారు. ఈసారి ఎన్నికల్లో సిపిఎం అభ్యర్థి పోటీలో ఉంటారని తెలిపారు

ఎట్టకేలకు ఆట స్థలానికి నిధులు

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని బక్కునాయుడు పేట బిఆర్ అంబేద్కర్ సంక్షేమ బాలికల వసతి గృహనికి సంబంధించిన ఆట స్థలానికి ప్రభుత్వం రూ.లక్ష నిధులను మంజూరు చేసింది. 2.6 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ మైదానంలో కబడ్డీ, హ్యాండ్‌బాల్, ఖోఖో ఆడుకునేందుకు వీలుగా క్రీడా మైదానాన్ని సిద్ధం చేయనున్నారు. ముఖ్యంగా మైదానంలో రాళ్ల లేకుండా జెసిబితో చదును చేయిస్తున్నామని ప్రిన్సిపల్ ఫ్లోరిన్సీ తెలిపారు. ఈ నిధులు మంజూరు చేయడానికి కారణమైన ప్రజాశక్తి విలేకరి అప్పారావును ఈ సందర్భంగా వసతి గృహం సిబ్బంది అభినందించారు.



మైదానాన్ని సదును చేస్తున్న జెసిబి

ప్రమాదకరంగా వీలుపర్తి రహదారి

ప్రజాశక్తి - వేపాడ

వేపాడ నుండి వీలుపర్తి మీదుగా వావిలిపాడు వెళ్లే రోడ్డు ప్రమాదక రంగా మారింది. నిబంధనలకు విరుద్ధంగా క్వారీ లారీలు అధిక లోడులతో రవాణా సాగించడంతో రోడ్డుపై రాతిపిక్క గుట్టల గుట్టలగా పడిపోవడంతో ద్విచక్ర వాహ నాలు, ఆటోలు, పిల్లలు పాఠశాలలకు వెళ్ళు సైకిళ్ల అదుపు తప్పి పడిపోతున్నాయి. సంబంధిత అధికారులు పట్టించుకోకపోవ డంతో క్వారీ యజమానులు వారికి నచ్చిన విధంగా అధిక లోడ్లతో లాభాలు పొందాలని ఆశ తప్ప ప్రజల పడు తున్న ఇబ్బందులు మాత్రం పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు అధిక లోడుతో వెళుతున్న వాహనాలపై తగు చర్యలు తీసుకుని ప్రమాదాలు జరగకుండా నివారించాలని ప్రయాణికులు కోరుతున్నారు.



బైక్ అదుపు తప్పి పడిపోతున్న ప్రయాణికుడు

నిందితుడికి రెండేళ్ల జైలు

ప్రజాశక్తి- విజయనగరం కోట

ఒకటో పట్టణ పోలీసు స్టేషన్‌లో 2022లో నమోదైన ఎటిఎం కార్డు మార్చి ఒక వ్యక్తిని మోసగించిన కేసులో నిందితునికి 2 సంవత్సరాలు జైలు శిక్ష, రూ.1500లు జరిమానా విధిస్తూ అడిషనల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ బి.రమ్య తీర్పు వెల్లడించినట్లుగా ఒకటో పట్టణ సిఐ బి. వెంకటరావు తెలిపారు. పట్టణంలోని ఎస్‌బిఐ మెయిన్ బ్రాంచ్ సమీపంలోని ఎటిఎం కేంద్రంలో 2022 జనవరి 24న మధ్యాహ్నం మెంటాడ మండలం జయతి గ్రామానికి చెందిన తాత్రాజు మల్లిస్వామి (ఫిర్యాది) నగదు విత్‌డ్రా చేయడానికి వెళ్లాడు. అక్కడ గుర్తు తెలియని వ్యక్తి సహాయం తీసుకోగా, సదరు వ్యక్తి ఫిర్యాది చెప్పిన పిన్ నంబరును గుర్తు పెట్టుకొని, నగదు విత్ డ్రా చేసిన తరువాత ఫిర్యాదికి అసలు ఎటిఎం కార్డుకు బదులుగా వేరే ఎటిఎం కార్డు ఇచ్చి, అక్కడ నుండి వెళ్ళిపోయాడు. అనంతరం, నిందితుడు వేరు వేరు ఎటిఎం కేంద్రాల్లో ఐదు విడతలుగా రూ. 86,750 నగదును ఫిర్యాది బ్యాంకు అకౌంట్ నుండి తీసుకున్నాడు. దీనిపై వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. మోసానికి పాల్పడిన వ్యక్తిని గుంటూరుకు చెందిన కే. విద్యాసాగర్‌గా పోలీసులు గుర్తించి, అరెస్టు చేసి, కోర్టులో అభియోగ పత్రం దాఖలు చేశారు. కోర్టు ప్రాసిక్యూషన్‌లో నిందితుడిపై నేరారోపణలు రుజువుకావడంతో పై విధంగా తీర్పు వెల్లడించినట్లు సిఐ తెలిపారు.

నేరాలు ఘోరాలు

అక్రమ మద్యం పట్టివేత

ప్రజాశక్తి - భోగాపురం

భోగాపురం, పూసపాటిరేగ మండలాల్లో అక్రమ మద్యం కలిగి ఉన్న ముగ్గురు వ్యక్తులను బుధవారం పట్టుకొని వారి వద్ద నుంచి 79 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసులు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. పూసపాటిరేగ మండలంలో కొల్లాయివలస గ్రామానికి చెందిన వెల్దుటి రామసూరి, గుమ్మడి పైడిరాజు ద్విచక్ర వాహనంపై 50 మద్యం సీసాలు తీసుకువస్తుండగా కోనాడ జంక్షన్ సమీపంలో ఎస్ఇబి సీఐ సురేష్ ఆధ్వర్యంలో తనిఖీ చేయగా పట్టుబడ్డారు. వీరిద్దరిపై కేసు నమోదు చేసి ద్విచక్ర వాహనాన్ని కూడా సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు. భోగాపురం గ్రామంలోని చాకివలస వెళ్లే బ్రిడ్జి సమీపంలో బొడ్డ అప్పలరాజు పాన్ షాప్‌లో తనిఖీ చేయగా 29 మద్యం సీసాలు లభించాయి. అప్పలరాజు పై కేసు నమోదు చేసినట్టు సిఐ ఏ రవికుమార్ తెలిపారు.

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సౌకర్యాలు

ప్రజాశక్తి- బొబ్బిలి

పోలింగ్ కేంద్రాలలో మౌలిక సౌకర్యాలు కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి చెప్పారు. పట్టణంలో ఉన్న పోలింగ్ కేంద్రాలను ఆమె బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాలలో ఓటర్లు ఇబ్బందులు పడకుండా చూడాలని ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. మరమ్మతులు ఉంటే బాగు చేయాలని సూచించారు. మౌలిక సౌకర్యాలు కల్పనకు పెద్దపీట వేస్తున్నామని చెప్పారు. ఆమెతో టౌన్ ప్లానింగ్ అధికారి వరప్రసాద్, ఎఇ సురేష్ తదితరులు ఉన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

బాడంగి: రాజ్యాంగం ద్వారా ఎన్నికల సంఘం కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ ఆంజినేయులు, తహశీల్దార్ రాజారావు అన్నారు. బుధవారం పాల్తేరు, వాడాడ గ్రామంలో ఓటు గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అధికార్లు



బొబ్బిలి: సిబ్బందికి సూచనలు చేస్తున్న కమిషనర్ రామలక్ష్మి

మాట్లాడుతూ 1950 జనవరి 25న ఎన్నికల సంఘం ఏర్పడిందని, అప్పటి నుంచి దేశంలో ప్రశాంతంగా, పారదర్శకంగా ఎన్నికలు జరుగుతున్నాయని గుర్తు చేశారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కలిగి ఉండాలని, రానున్న సార్వత్రిక ఎన్నికలలో తమ ఓటు హక్కు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేటి నుండి పిఒలకు శిక్షణ

లక్కవరపుకోట: సాధారణ ఎన్నికలలో విధులు నిర్వహించేందుకు మండల వ్యాప్తంగా ఉన్న ఎస్టిటి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న 74 మంది ఉపాధ్యాయులను పిఒలుగా నియమిస్తూ జిల్లా కలెక్టర్ నుండి ఆదేశాలు వచ్చినట్లు స్థానిక ఎంఇఒలు సిహెచ్ కూర్మారావు, ఎం శ్రీనివాసరావులు బుధవారం తెలిపారు. వీరికి ఈ నెల 28న ఎస్‌కోట జూనియర్ ప్రభుత్వ కళాశాలలో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

వేపాడ: మండలంలోని పాటూరు, బొద్దాం గ్రామంలో ఎన్నికల సందర్భంగా ముందస్తు చర్యల్లో భాగంగా గ్రామాలలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా ఉండేందుకు ప్రజలతో పోలీసులు బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయనగరం డిఎస్‌పి గోవింద మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచులు, ఎంపిటిసిలు, యువకులు, ఎస్‌కోట సిఐ, వల్లంపూడి ఎస్ఐ తదితరులు పాల్గొన్నారు.